సాక్షి
విశాఖపట్నం

గురువారం, 31, జూలై, 2025


అక్రమాలకు పాల్పడితే చర్యలు 8లో


మా ఇళ్ల జోలికొస్తే.. ప్రాణాలు తీసుకుంటాం 8లో


కుళాయిల నుంచి కలుషిత నీరు 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా పద్మారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా సాడి పద్మారెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

నలుగురు డీటీలకు బదిలీ

మహారాణిపేట : రెవెన్యూ శాఖలో నలుగురు డిప్యూటీ తహసీల్దార్లకు బదిలీ జరిగింది. ఈ మేరకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పెదగంట్యాడ తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న బి.ఎస్.ఎస్.ప్రసాద్‌ను భీమిలి తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా నియమించారు. స్టీల్‌ప్లాంట్ భూసేకరణ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న ఎన్.రవికాంత్‌ను గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ, జాతీయ రహదారి) కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న జి.కిశోర్‌ను పెందుర్తి డీటీగా, పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న సంతోష్ కిరణ్‌ను స్టీల్‌ప్లాంట్ భూసేకరణ కార్యాలయంలో నియమించారు. అలాగే ఇద్దరు వీఆర్‌వోలను డిప్యూటేషన్ మీద పెందుర్తి మండలంలో నియమించారు.

లక్ష్యాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు


సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : వారాంతపు లక్ష్యాలకు అనుగుణంగా ఎన్టీఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జరగాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. 2026 మార్చి నాటికి అన్ని ఇళ్లు పూర్తి కావాలని నిర్దేశించారు. బుధవారం హౌసింగ్, స్పెషల్ ఆఫీసర్లు, ఇతర అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సమీక్షించారు. లక్ష్య సాధనలో విఫలమైన అధికారులు, సిబ్బందికీ మెమోలు జారీ చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. ఎస్సీ, బీసీ వర్గాల వారికి రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేలు ప్రభుత్వం అందిస్తున్న అదనపు సాయంపై మరింత అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యుత్, తాగునీరు, డ్రెయిన్లు, అప్రోచ్ రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. ఫేస్ అథెంటికేషన్, స్టేజ్ అప్డేషన్ ప్రక్రియలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. వీజేపాలెం, మామిడిపాలెం లేఅవుట్లలో స్థానికుల నుంచి ఎదురవుతున్న సమస్యలను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. గృహ నిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ తొలి క్వార్టర్‌లో 12.25 శాతం వృద్ధి


మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్‌బోహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్ బోహ్రా బుధవారం దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం సమావేశ మందిరంలో సరకు రవాణా ఖాతాదారులు, వ్యాపార భాగస్వాములతో సమావేశమయ్యారు. నూతన వ్యాపార పద్ధతులు, పరస్పర సహకారం, సరైన సరకు రవాణాలో మెరుగైన పద్ధతులు, శక్తివంతమైన సమాచార వ్యవస్థ వంటి అంశాలపై చర్చించారు. వాల్తేర్ డివిజన్ ఈ సంవత్సరం ఇంతవరకు మొదటి క్వార్టర్‌లో 12.25 శాతం వృద్ధి సాధించినట్లు తెలిపారు. వైజాగ్ సీ పోర్ట్, గంగవరం పోర్టు, సెయిల్, వేదాంత, ఐటీఎల్, బోత్ర, హెచ్ఐక్యూ సర్వీస్, కేఆర్ అండ్ సన్స్, భూషణ్ పవర్, ఉత్కల అల్యూమినా, నాల్కో, కాంకోర్, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, ఇండియా ఫాస్ఫేట్ లిమిటెడ్, ఆర్‌సీఎల్ కంపెనీల ప్రతినిధులతో పాటు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్ ముఖోపాధ్యాయ్, సీనియర్ డీసీఎం సందీప్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఏయూలో నేడు జాబ్‌మేళా

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ దొరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళా ద్వారా ఆరు కంపెనీల్లో సుమారు 200 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఏయూ కెరీర్ గైడెన్స్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 0891-2844184 నంబర్‌కు సంప్రదించవచ్చు.

రైతుల భూములపై పూలింగ్ పంజా!



మొత్తం 1941.19 ఎకరాల సమీకరణ

- రైతులకు ఇచ్చేది 900, 450 గజాలు మాత్రమే
- అసైన్డ్ భూముల హక్కులు కల్పించేలా చేసిన వైఎస్ జగన్
- ఇప్పుడు పూలింగ్ పేరుతో కాజేస్తున్న ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

పేద రైతులకు భూమి దక్కాలనే ఉద్దేశంతో అసైన్డ్ భూములపై సర్వాధికారాలు కట్టబెడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 20 ఏళ్లు దాటిన అసైన్‌దారులకే పూర్తి హక్కులు కల్పించేలా నిషేధిత జాబితా నుంచి ఎత్తివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ ఆదేశాలపై నిషేధాన్ని అమలుచేస్తోంది. గత ఏడాది కాలంగా ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిషేధం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు ఈ నిషేధం మాటున రైతుల భూములపై పూలింగ్ పేరుతో పంజా విసిరేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకు అనుగుణంగా విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలతో పాటు విజయనగరం జిల్లాలను కలుపుకొని ఏకంగా 1,941.19 ఎకరాల భూమిని పూలింగ్ పేరుతో సమీకరించేందుకు విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీకి(వీఎంఆర్‌డీఏ) అధికారాలను అప్పగించింది. తద్వారా రైతులకు కేవలం 450 గజాల నుంచి 900 గజాలు మాత్రమే ఇచ్చి.. మిగిలిన భూమితో వ్యాపారం చేసేందుకు తయారవుతోంది. అంతేకాకుండా ఇప్పటికే కొందరు కూటమి నేతలు పూలింగ్ పేరుతో సమీకరించనున్న కొన్ని ముఖ్యమైన సర్వే నెంబర్లలోని రైతులతో ముందస్తు బలవంతపు ఒప్పందాలు చేసుకొని.. నామమాత్రంగా పైసలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నారనే విమర్శలున్నాయి.

భూసమీకరణ పేరుతో భూకబ్జా..!

వాస్తవానికి విశాఖపట్నం సమీప ప్రాంతాల్లో భూమి ధర ఎక్కువగా ఉంది. ఎకరా రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకూ పలుకుతోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో మరింతగా ధరలు పెరుగుతున్నాయి. ఇక్కడ పేద రైతులకు అనేక ప్రాంతాల్లో గతంలో అసైన్‌మెంటు కమిటీల ద్వారా పట్టాలు మంజూరు చేశారు. ఆయా భూముల్లో రైతులు సాగుచేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిషేధం ఎత్తివేయడంతో ఈ భూములను విక్రయించుకునేందుకు అవకాశం వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో పేద రైతుల భూములను కాజేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అసైన్ చేసిన రైతులకు దక్కేది 900 గజాలు మాత్రమేనని పేర్కొంటోంది. ఇక పదేళ్ల కంటే ఎక్కువ కాలంగా సాగు చేసుకుంటున్న రైతులకు 450 గజాల స్థలం ఇస్తామని చెబుతోంది.

రైతులకు హక్కు దక్కకుండా...!

వాస్తవానికి 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న అసైన్‌దారులకు పూర్తి స్థాయిలో వారికే హక్కులు దక్కే విధంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, అందులో ఏదో జరిగిపోయిందనే రీతిలో కూటమి ప్రభుత్వం ప్రచారం చేసింది. ఇప్పటికే రెండు దఫాలుగా పలువురు అధికారులతో విచారణ కూడా చేపట్టింది. ఎలాగైనా తప్పులు ఎత్తిచూపాలనే ఉద్దేశంతో ఒత్తిడి తెచ్చి మరీ విచారణ చేపట్టింది. అయినప్పటికీ ఒక్క చిన్న తప్పు కూడా జరగలేదని తేలింది. అయినప్పటికీ విశాఖలో భూములు దోచుకున్నారంటూ విషప్రచారం చేశారు. తీరా విచారణలో తేలకపోయినప్పటికీ నిషేధాన్ని మాత్రం కొనసాగిస్తూనే వస్తున్నారు. ఇప్పుడు భూసమీకరణ పేరుతో పేదల భూములను కాజేసేందుకు వీఎంఆర్‌డీఏ రూపంలో ప్రభుత్వం సిద్ధమైంది. ఒకవేళ గత ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేసి ఉంటే.. రైతులకు తమకు ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలను విక్రయించుకునేందుకూ అవకాశం దక్కేది. ఇప్పుడు కేవలం 900, 450 గజాల స్థలానికి మాత్రమే పరిమితం కావాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

ఏయే ప్రాంతాల్లో ఎంత భూమి అంటే...!

గ్రామం పేరు	మండలం	సర్వే నంబరు	ప్రతిపాదిత ల్యాండ్‌పూలింగ్
	విశాఖపట్నం		
గిడిజాల	ఆనందపురం	258	309.18
గోరింట	ఆనందపురం	108	198.31
శొంఠ్యాం	ఆనందపురం	347పి	251.55
జి.డి.పాలెం	ఆనందపురం	1	122.53
కొవ్వాడ	పద్మనాభం	237	250.52
	మొత్తం విస్తీర్ణం		1,132.09
	విజయనగరం జిల్లా		
మోదవలస	డెంకాడ	241, 242, 243	20.41
రావాడ	భోగాపురం	64-1	5.00
	మొత్తం విస్తీర్ణం		25.41
	అనకాపల్లి జిల్లా		
అంతకాపల్లి	సబ్బవరం	--	175.42
బాటజంగాలపాలెం	సబ్బవరం	--	141.01
ఎ.సిరసపల్లి	సబ్బవరం	--	371.75
నల్లరేగుడుపాలెం	సబ్బవరం	--	27.37
పైడివాడ అగ్రహారం	సబ్బవరం	--	28.14
తగరంపూడి	అనకాపల్లి	--	40.00
	మొత్తం విస్తీర్ణం		783.69

కన్నేసిన కూటమి నేతలు...!

ల్యాండ్ పూలింగ్ వల్ల అసైన్‌దారులు నష్టపోనున్నారు. కేవలం 450, 900 గజాల స్థలంతో సరిపెట్టుకోవాల్సి రానుంది. ఇప్పటికే కూటమిలోని కీలక నేతలకు ఏయే ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ జరగనుందనే దానిపై పక్కా సమాచారం ఉంది. దీంతో బాగా విలువైన ప్రాంతాల్లోని సర్వే నెంబర్లలో గల రైతులతో ముందస్తుగా బెదిరింపులకు దిగి.. ఒప్పందాలు చేసుకున్నట్టు తెలుస్తోంది. 'మీ పట్టా భూములు మాకు అప్పగించండి... మీకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఇస్తామంటూ' కీలక ప్రాంతాల్లోని భూములకు సంబంధించి ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఇందులో టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేతో పాటు ఒక కార్పొరేషన్ చైర్మన్, ఓ మంత్రి, ఎంపీ, చినబాబులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రైతుల నుంచి తక్కువ ధరకు తీసుకుని పూలింగ్ పేరుతో వచ్చే 900 గజాల స్థలాన్ని కూడా కూటమి నేతలే కాజేసేందుకు రంగం సిద్ధమైంది.

తల్లిదండ్రులు, వృద్ధులను గౌరవిద్దాం

2007 తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల పోషణ– సంక్షేమ చట్టంపై అవగాహన


వర్క్‌షాపులో పాల్గొన్న అధికారులు

మహారాణిపేట: తల్లిదండ్రులు, వృద్ధులను ప్రేమతో, గౌరవంగా చూసుకోవాలని హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధులు, అధికారులు యువతకు పిలుపునిచ్చారు. వారి సంక్షేమం, సంరక్షణ కోసం రూపొందించిన 2007 తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల పోషణ- సంక్షేమ చట్టం గురించి అందరూ తెలుసుకోవాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన ఒకరోజు వర్క్‌షాప్‌లో హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధులు, పోలీసు, రెవెన్యూ, ఇతర జిల్లా స్థాయి అధికారులు ఈ చట్టం అమలు, అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా హెరిటేజ్ ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్ట్ చదలవాడ ప్రసాద్, న్యాయవాది కొంగారపు గణపతి మాట్లాడుతూ వృద్ధులకు కార్యాలయాలు, ఆసుపత్రులు, పోలీస్ స్టేషన్లలో సులభంగా సేవలు అందించాలన్నారు. ప్రత్యేక అవసరాల్లో వారికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ చట్టం అమలులో ఆర్డీవోలు ట్రిబ్యునల్ అధికారిగా వ్యవహరిస్తారని, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారన్నారు. 60 రోజుల్లో సమస్య పరిష్కారం కాని పక్షంలో కలెక్టర్‌ను అప్పిలేట్ ట్రిబ్యునల్‌గా సంప్రదించవచ్చని తెలిపారు. సివిల్ కోర్టు పరిధిలోని ఫిర్యాదుల్లో ట్రిబ్యునల్ జోక్యం చేసుకోదని స్పష్టం చేశారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద 80 ఏళ్లు పైబడిన వారికి రూ.5 లక్షల వరకు బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. గిఫ్ట్ డీడ్ విషయంలో సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అనుసరించాలని పేర్కొన్నారు.

వృద్ధుల కోసం కేజీహెచ్‌లో ప్రత్యేక ఓపీ

కేజీహెచ్ ఆర్ఎంవో బంగారయ్య మాట్లాడుతూ వయో వృద్ధుల సౌకర్యార్థం ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుర్తు తెలియని వృద్ధులు, బిచ్చగాళ్లు అనారోగ్యంతో వస్తే వారికి ప్రత్యేక వార్డులో చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు.

టైమ్ బ్యాంక్‌లో చేరాలి

వయో వృద్ధులకు సహాయపడేందుకు విశాఖలో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలవుతున్న టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో స్వచ్ఛందంగా చేరాలని నిర్వాహకులు కోరారు. 2019లో ప్రారంభమైన ఈ విధానం దేశంలోని పలు నగరాల్లో అమలవుతోందని, విశాఖలోని 12 పిన్‌కోడ్ లాగిన్ ఏరియాల్లో అందుబాటులో ఉందని వివరించారు. ఇందులో ఆర్థిక లావాదేవీలు ఉండవని, పరస్పర సహకారం మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండినవారెవరైనా ఇందులో చేరవచ్చని, వివరాలకు 94403 01311ను సంప్రదించవచ్చని సూచించారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు, హిజ్రాలు, సీనియర్ సిటిజన్ల సంక్షేమ శాఖ ఏడీ కవిత, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు 31 నాటికి 50 శాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యం

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



డాబాగార్డెన్స్: వచ్చే నెల 31 నాటికి 50 శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యంగా రెవెన్యూ అధికారులు పనిచేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, డీసీఆర్ శ్రీనివాసరావు, అన్ని జోన్‌ల రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో పాటు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆగస్టు 31 నాటికి 50 శాతం ఆస్తిపన్ను వసూలు లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. గత వారంతో పోల్చుకుంటే కొన్ని జోన్లలో వసూళ్ల శాతం పెరిగినప్పటికీ మరికొన్ని జోన్లలో మందకొడిగా వసూళ్లు జరుగుతున్నాయన్నారు. ప్రతి రెవెన్యూ అధికారి డిమాండ్లకు తగిన విధంగా ఆస్తిపన్ను వసూళ్లు పెంచాలని ఆదేశించారు. వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు డోర్ టు డోర్ సర్వే నిర్వహించి, కొత్త, పాత భవనాల కొలతలు సరి చూడాలని, తాగునీటి కనెక్షన్ ఉంటే వారు ఆస్తి పన్నుతో పాటు నీటి పన్ను చెల్లిస్తున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. ఈ ప్రక్రియ ఆగస్టు 5 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల ఆస్తిపన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి రూల్ బుక్ ప్రకారం వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టు కేసులను స్టడీ చేసి.. కౌంటర్ ఫైల్ చేయాలని ఆదేశించారు. కోర్టులో కేసు ఉందని ఆస్తి పన్ను వసూలుకు వెనుకాడవద్దన్నారు. ఆస్తి పన్ను వసూలు కేంద్రాలు పెంచేందుకు ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో ఉన్న ఒక సచివాలయాన్ని ఎంపిక చేసుకుని అక్కడ అవసరమయ్యే మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆస్తి పన్ను జీవీఎంసీ కమిషనర్ అకౌంట్‌లో జమయ్యేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న బిల్ డెస్క్‌ను ప్రమోట్ చేసి, జీరో సర్వీస్ చార్జీలతో పన్నులు వసూలు అయ్యేటట్టు చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ఐటీ విభాగం అధికారులను ఆదేశించారు.

యథావిధిగా కిరండూల్ రైళ్ల రాకపోకలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి కోరాపుట్-కిరండూల్ మధ్య జరుగుతున్న పనులు పూర్తయినందున యథావిధిగా రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖ-కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్, కిరండూల్-విశాఖ(18516) నైట్ ఎక్స్‌ప్రెస్, విశాఖ-కిరండూల్(58501) పాసింజర్, కిరండూల్-విశాఖ(58502) పాసింజర్ వాటి షెడ్యూల్ ప్రకారం కిరండూల్ వరకు, కిరండూల్ నుంచి రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

జీతాలు మహాప్రభో!

'ఓడెక్కే వరకు ఓడ మల్లన్న.. ఓడ దిగిన తర్వాత బోడి మల్లన్న' అన్నట్టుగా ఉన్నది కూటమి ప్రభుత్వ తీరు. ఎన్నికలకు ముందు ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం .. ఇప్పుడు ఉద్యోగుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. బదిలీల ప్రక్రియను అడ్డం పెట్టుకుని ప్రభుత్వ ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బందికి జీతాలు నిలిపివేసి వారిని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది. సమన్వయ లోపం, పరిపాలనా వైఫల్యంతో సుమారు 2 వేల మంది ఉద్యోగులు జీతం కోసం ఎదురుచూడాల్సిన దయనీయ పరిస్థితిని కల్పించింది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వేతనాలు అందక.. ఉద్యోగ కుటుంబాలు పడుతున్న వేదన ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతోంది. – మహారాణిపేట

- బదిలీ అయిన ఉద్యోగులకు అందని జీతాలు
- టీచర్, రెవెన్యూ ఉద్యోగుల పరిస్థితి దారుణం
- టీచర్లకు ఐడీ కేటాయింపులో జాప్యం
- జీతాల కోసం 2వేల మంది ఎదురుచూపులు

జిల్లాలో ఇటీవల బదిలీ అయిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, రెవెన్యూ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. బదిలీ ప్రక్రియ పూర్తి చేసుకుని కొత్త స్థానాల్లో విధుల్లో చేరినప్పటికీ.. జీతాలు చెల్లించకుండా అవస్థల పాల్జేస్తోంది. జూన్ నెల జీతం ఇప్పటికీ జమ కాకపోగా.. జూలై నెల జీతం కూడా అందడం కష్టమేనని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీలను సాకుగా చూపి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ఇది తమను తీవ్రంగా ఇబ్బంది పెట్టడమేనని ఉద్యోగులు వాపోతున్నారు. విద్యాశాఖ, ట్రెజరీ విభాగాల మధ్య సమన్వయ లోపం, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి దాపురించిందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

బదిలీల పేరుతో చుక్కలు

సాధారణ బదిలీల్లో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, వీఆర్వోలు భారీ సంఖ్యలో బదిలీ అయ్యారు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. బదిలీలపై నిషేధం అమల్లో ఉన్నప్పటికీ.. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ రెవెన్యూలో బదిలీలను కొనసాగిస్తున్నారు. అయితే బదిలీ అయిన టీచర్లకు సంబంధించినంత వరకు.. గత నెల 15వ తేదీ నాటికే ప్రక్రియ పూర్తయింది. అయినప్పటికీ చాలా మంది ఉపాధ్యాయులకు నేటికీ కొత్త పొజిషన్ ఐడీలు కేటాయించలేదు. ఈ సాంకేతిక కారణంతోనే జూన్‌కు రావాల్సిన జీతం ఆగిపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆగస్టు మొదటి వారంలో అందాల్సిన జూలై జీతం కూడా వచ్చే అవకాశం లేదని స్పష్టమవుతోంది. ఒకవైపు ఉపాధ్యాయులంతా బోధనేతర కార్యక్రమాల వల్ల తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రభుత్వం ఒకటే యాప్‌లో విభిన్నమైన కార్యక్రమాలను చేయమని చెప్పి బోధన కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తోంది. మరోవైపు జీతాలు చెల్లించకుండా ఆర్థికంగా ఇబ్బందులు పెడుతోందని వాపోతున్నారు.

ఉద్యోగుల గోడు పట్టదా?

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి జూన్, జూలై నెలల్లో అధికంగా ఖర్చులు ఉంటాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో పిల్లల స్కూలు ఫీజులు, పుస్తకాలు, ఇతర సామగ్రి కోసం వేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి తోడు బదిలీ అయిన ప్రాంతానికి కుటుంబంతో సహా మారడానికి రవాణా ఖర్చులు, కొత్త ఇంటి అడ్వాన్సులు, నెలవారీ అద్దెలు అదనపు భారంగా మారాయి. వ్యవసాయ నేపథ్యం ఉన్న ఉద్యోగులకు విత్తనాలు, ఎరువులు, దుక్కుల వంటి ఖర్చులు కూడా ఉంటాయి. ఇలాంటి కీలక సమయంలో జీతాలు సకాలంలో అందకపోవడంతో నెలవారీ ఈఎంఐలు, వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలకు సంబంధించిన చెక్కులు బౌన్స్ అవుతున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. ఒకవైపు బదిలీల భారం, మరోవైపు జీతాలు ఆగిపోవడంతో తమ పరిస్థితి దయనీయంగా మారిందని ఉపాధ్యాయులు, రెవెన్యూ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇటీవల డీఈవో కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, తమ జీతాలను విడుదల చేయాలని వారు కోరుతున్నారు.


జీతాల కోసం డీఈవో కార్యాలయం ఎదుట టీచర్ల నిరసన(ఫైల్)

విద్యాశాఖ, ట్రెజరీ నిర్లక్ష్యం



విద్యాశాఖ, ట్రెజరీ శాఖల వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పిల్లల చదువు, ఇతర అవసరాల కోసం ఎక్కువ ఖర్చులు ఉంటాయి. ఈ నేపథ్యంలో జీతాలు రాకపోవడంతో టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే పొజిషన్ ఐడీలను కేటాయించి, జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలి. – టి.ఆర్.అంబేడ్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

జీవీఎంసీ వాహనాలకు జీపీఎస్ వ్యవస్థ పటిష్టం

మహారాణిపేట : జీవీఎంసీ వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను పటిష్ట పరచాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ మెకానికల్ పర్యవేక్షక ఇంజనీర్ జి.గోవిందరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ ఎ.రత్నాకర్ రెడ్డి, మెకానికల్ అడ్వైజర్ ఎం.కె.సాయిబాబు, ఫాస్ట్ ఫార్వర్డ్ టెక్నికల్ టీమ్ వి.సుధీర్, ఎంట్రో ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.సురేంద్రలతో కలిసి సమీక్ష నిర్వహించారు. విధుల్లో ఉన్న వాహనాలు నిలిపివేయడం గాని, దారి మళ్లించడం గాని చేయరాదన్నారు. అధికారులకు కేటాయించిన వాహనాల వివరాలు డిజిటల్ విధంగా చూపించాలని, ఎలాంటి హోదా కలిగిన అధికారులు వాహనాలను వినియోగిస్తున్నారో ట్రాక్ చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను పటిష్ట పరచడం వల్ల వాహనాల పనితీరును గమనించవచ్చన్నారు. వాహన డ్రైవర్ల లాగ్ బుక్, మెయింటెనెన్స్, మరమ్మతులు, మైలేజీలను ఎప్పటికప్పుడు డిజిటల్ రూపంలో పొందుపరచాలని ఆదేశించారు. పారిశుధ్యం వాహనాలకు ప్రత్యేకించి రూట్ మ్యాప్‌ను రూపొందించి, అవి సక్రమంగా వెళ్తున్నాయా లేదా వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారా అని పరిశీలించాలన్నారు.



బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాజ్ మహల్ నమూనా నగరవాసులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. సందర్శకులతో కిటకిటలాడుతున్న ఈ ప్రాంగణం.. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులతో సరికొత్త అందాలను సంతరించుకుంటోంది. చుట్టూ ఉన్న అందమైన ఫౌంటెన్లతో మెరిసిపోతూ, చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తోంది. సెల్ఫీలు, షార్ట్స్, రీల్స్ చేసుకునే యువతకు ఇది చక్కటి వేదికగా మారింది. రోజూ వందలాది మంది ఇక్కడికి వచ్చి ఫొటోలు తీసుకుంటూ.. 'వాహ్ తాజ్' అంటూ మురిసిపోతున్నారు. - ఏయూ క్యాంపస్

క్లుప్తంగా

అక్రమాలకు పాల్పడితే చర్యలు

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు
- ఐవీఎఫ్, సరోగసీ కేంద్రాల్లో కొనసాగిన తనిఖీలు

మహారాణిపేట: నగరంలోని ఐవీఎఫ్, సరోగసీ కేంద్రాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు ఆయా కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. ఫెర్టీ9 ఐవీఎఫ్ సెంటర్, వైజాగ్ ఐవీఎఫ్ సెంటర్, డాక్టర్ ఆడమ్స్ ఫెర్టిలిటీ సెంటర్(పీఎంపాలెం)లను సందర్శించి రికార్డులను పరిశీలించారు. స్కానింగ్ రికార్డులను తనిఖీ చేసి, ఫారం–ఎఫ్ గురించి వారికి వివరించారు. అన్ని సరోగసీ కేంద్రాలు నియమ నిబంధనలు, ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కేంద్రాల నిర్వాహకులకు డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు. ఎటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. సకాలంలో రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవడం తప్పనిసరి అని సూచించారు. సరోగసీ కేంద్రాలు, ఏఆర్‌టీ బ్యాంక్ ఎల్1, ఎల్2లను క్షుణ్ణంగా పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ పేరుతో మోసం

- ముగ్గురి అరెస్టు

అల్లిపురం: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో గతంలో సైబర్ క్రైం పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు జరిపిన పోలీసులు విజయనగరం జిల్లా మెంటాడ మండలానికి చెందిన లోకారపు తిరుపతి, జాగరపు సన్యాసిరావు, లచ్చిరెడ్డి పోలినాయుడులను బుధవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మొదట లాభాలు చూపించి తరువాత మోసం చేస్తున్నారని చెప్పారు. మ్యాచ్ వచ్చే సమయంలో లైన్ ఆఫ్ చేసి మోసాలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

భర్తపై వేడినీళ్లు పోసిన భార్య

కొమ్మాది: ఓ మహిళ తన భర్తపై మరుగుతున్న నీళ్లు పోసిన సంఘటన బీచ్‌రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలివి. జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి నేరెళ్లవలసకు చెందిన నంది కృష్ణ అదే ప్రాంతానికి చెందిన తన మేనమామ కుమార్తె గౌతమిని ఆరేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. కూలి పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే వారి మధ్య మనస్పర్థల కారణంగా మూడేళ్ల నుంచి విడిగా ఉంటున్నారు. తల్లిదండ్రులు ఇద్దరినీ కలపడంతో ఈ నెల 28 నుంచి ఒకే ఇంట్లో కలసి ఉంటున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి వీరిరువురి మధ్య చిన్న తగాదా చోటు చేసుకుంది. అర్ధరాత్రి నిద్రలో ఉన్న భర్త కృష్ణపై గౌతమి మరుగుతున్న వేడి నీళ్లను పోసింది. దీంతో కృష్ణ ముఖం కాలిపోయింది. పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని కృష్ణను కేజీహెచ్‌కు తరలించారు. కృష్ణ కుటుంబ సభ్యులు బుధవారం భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయాలపాలైన నంది కృష్ణ

కొత్త కార్డులకు కొర్రీలు

- కార్డుల కోసం వేలల్లో దరఖాస్తులు
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- చుక్కలు చూపిస్తున్న నిబంధనలు
- కార్డుల్లో మార్పులు, చేర్పులకు నో ఆప్షన్



మహారాణిపేట: ఎన్నికల ముందు అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు దరఖాస్తుదారులకు కఠిన నిబంధనలతో గట్టి షాక్ ఇస్తోంది. కొత్త కార్డులు వస్తాయన్న ఆశతో సచివాలయాలకు పరుగులు తీస్తున్న వేలాది మందికి అక్కడి నిబంధనలు చూసి నిరాశే ఎదురవుతోంది. దరఖాస్తు ప్రక్రియలో ఎదురవుతున్న అడ్డంకులు, సాఫ్ట్‌వేర్ సమస్యలతో అర్హులు సైతం అనర్హులుగా మిగిలిపోయే పరిస్థితి నెలకొంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది తర్వాత కొత్త కార్డుల దరఖాస్తుకు అవకాశం కల్పించింది. అయితే ప్రభుత్వం విధించిన పలు నిబంధనలు దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఒక కార్డులో తల్లిదండ్రులు, కుమారుడు ఉండి.. కుమారుడికి వివాహమైతే కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేదు. కుమారుడిని ప్రస్తుత కార్డు నుంచి తొలగించడం లేదా కుమారుడు, కోడలి పేరిట కొత్త కార్డు ఇవ్వడానికి నిబంధనలు అడ్డుపడుతున్నాయి. తొలగింపు, చేర్పులకు సాఫ్ట్‌వేర్‌లో ఆప్షన్ లేదు. ఇదే పరిస్థితి వివాహమైన కుమార్తెల విషయంలోనూ ఉంది. దీంతో కొత్త జంటలు కార్డులు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఒక కార్డులోని కుమారుడు లేదా కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం వస్తే.. ఆ కుటుంబంలో ఎవరికీ ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పింఛన్లు, ఇతర పథకాలు కూడా నిలిచిపోతున్నాయి. ఇది వారిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొత్త రేషన్ కార్డు కోసం కరెంటు బిల్లు తప్పనిసరి చేశారు. ఎప్పుడైనా పొరపాటున అధిక బిల్లు వచ్చినా, వారి దరఖాస్తును తిరస్కరిస్తున్నారు. ఆ బిల్లును విద్యుత్ కార్యాలయంలో సరిచేయించుకుని వచ్చే వరకు దరఖాస్తుకు అవకాశం లేకుండా పోతోంది. భార్యాభర్తల ఆధార్ కార్డులలో వేర్వేరు చిరునామాలు ఉంటే, వారి దరఖాస్తు ముందుకు సాగడం లేదు. ఇద్దరి చిరునామాలను ఒకే ప్రాంతానికి మ్యాపింగ్ చేస్తేనే కార్డుకు దరఖాస్తు చేసుకునే వీలు కలుగుతోంది. ఈ కఠిన నిబంధనలకు తోడు, సర్వర్ సమస్యలు దరఖాస్తుదారులకు తలనొప్పిగా మారాయి. గంటల తరబడి వేచి ఉన్నా సర్వర్ డౌన్ లేదా ఈ ఆప్షన్ లేదు అనే సమాధానమే సచివాలయ సిబ్బంది నుంచి వస్తోంది. దీనిపై ఏమి చేయాలో తెలియని సిబ్బంది, దరఖాస్తుదారులను కలెక్టరేట్‌లోని సివిల్ సప్లైస్ కార్యాలయానికి పంపుతున్నారు. అక్కడికి వెళ్తే, తిరిగి సచివాలయంలోనే నమోదు చేసుకోవాలని చెప్పడంతో ప్రజలు అటూ ఇటూ తిరుగుతూ తీవ్ర అసహనానికి గురవుతున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఆగస్టు 25 నుంచి కొత్త కార్డులు ఇస్తామని ప్రకటించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తే అది ఎంతవరకు సాధ్యమవుతుందనే దానిపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఈ అడ్డగోలు నిబంధనలను సడలించి, సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేస్తేనే కొత్త కార్డుల జారీ సాధ్యమవుతుంది. లేకపోతే పేదల ఆశలు అడియాసలుగానే మిగిలిపోతాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గొయ్యిని తప్పించబోయి.. మృత్యు ఒడికి..

- ట్రాలర్ కింద పడి సినర్జీస్ ఉద్యోగి మృతి
- ఈ ఏడాది మే నెలలో వివాహం



కూర్మన్నపాలెం: 'ఇంకొద్ది సేపట్లో ఇంటికి వస్తున్నా..' అని చెప్పి కంపెనీ నుంచి బయలుదేరిన ఆ యువకుడి మాటలే చివరివయ్యాయి. విధులకు వెళ్లిన భర్త తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న ఆ నవ వధువుకు తీరని శోకం మిగిలింది. కళ్లెదుటే భవిష్యత్తు బంగారంగా కనిపిస్తుండగా.. రహదారిపై ఉన్న గొయ్యి ఆ కుటుంబాన్ని ఛిద్రం చేసింది. ఒక ఇంజినీర్ నూరేళ్ల జీవితాన్ని బలిగొంది. సినర్జీస్ సంస్థలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాహుల్‌కు ఈ ఏడాది మేలోనే వివాహం జరిగింది. భార్య, తండ్రితో కలిసి జీవీఎంసీ 87వ వార్డు కణితికాలనీలోని వైష్ణవి అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నాడు. రోజూ లాగే బుధవారం కూడా విధులను ముగించుకుని తన బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. దువ్వాడ సమీపంలోని రాజీవ్‌నగర్ వద్ద రహదారిపై ఉన్న ఓ గొయ్యి రూపంలో మృత్యువు కాపు కాసింది. ఆ గొయ్యిని తప్పించే చిన్న ప్రయత్నంలో రాహుల్ అదుపుతప్పాడు. బైక్‌పై నుంచి కింద పడి.. వెనకనే వస్తున్న భారీ ట్రాలర్ చక్రాల కింద నలిగిపోయాడు. అక్కడికక్కడే కన్నుమూశాడు. కొద్ది నిమిషాల్లో ఇంట్లో ఉండాల్సిన రాహుల్.. రక్తపు మడుగులో నిర్జీవంగా పడి ఉన్న దృశ్యం చూపరుల హృదయాలను కలచివేసింది. ఈ వార్త తెలియగానే ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. తన కుమారుడు నేల మీద నిర్జీవంగా పడి ఉండటాన్ని చూసి ఆ తండ్రి గుండెలవిసేలా రోదించాడు. అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఉన్న ఆ గొయ్యి.. ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న దువ్వాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. రాహుల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ మల్లేశ్వరరావు నేతృత్వంలో ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలోనే మృతి చెందిన సినర్జీస్ ఉద్యోగి రాహుల్

మా ఇళ్ల జోలికొస్తే.. ప్రాణాలు తీసుకుంటాం



మీడియాతో మాట్లాడుతున్న రజబీధి వాసులు (ఇన్‌సెట్) కన్నీరుమున్నీరవుతున్న మహిళలు

- కార్పొరేటర్ మూర్తి యాదవ్ మా గృహాలను కాజేయాలని చూస్తున్నారు
- ఇళ్లు కూల్చి నాలుగు అంతస్తుల భవంతి కడతామంటున్నారు
- 22వ వార్డు రజకబీధి కాలనీవాసుల ఆరోపణ

మద్దిలపాలెం: 'కార్పొరేటర్ మూర్తి యాదవ్ మా ఇళ్లను కాజేయాలని చూస్తున్నారు. వాటిని కూల్చి ఆ స్థలంలో నాలుగంతస్తుల భవనం నిర్మిస్తానని చెబుతున్నారు. అందులో ఒక అంతస్తు మాకు ఇచ్చి, మిగిలిన మూడు తీసుకుంటున్నానని నిత్యం బెదిరిస్తున్నారు.' అని 22వ వార్డు రజకవీధి కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మా ఇళ్ల జోలికి వస్తే పెట్రోల్ పోసుకుని తగలబెట్టుకుంటామని హెచ్చరించారు. బుధవారం కాలనీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహిళలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఏకంగా జీవీఎంసీ అధికారులను రంగంలోకి దింపి మాపై ఒత్తిడి తీసుకువస్తున్నారని వాపోయారు. మా ప్రాణాలు పోతే పీతల మూర్తి దానికి కారణమంటూ కన్నీరుపెట్టుకున్నారు. చాకలిపేటను ఆనుకుని ఉన్న స్థలంలో నాలుగు అంతస్తుల భవనం కట్టి, అందులో ఓ అంతస్తు మాకు ఇచ్చి, మిగిలిన మూడు అంతస్తులను తాను తీసుకుంటానని కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఆఫర్ ఇచ్చారని, దానికి అంగీకరించకపోవడంతో అధికారులతో బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. ఆయన తీరుపై పలుమార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన పాపానికి ఏకంగా మా ఇళ్లను లాక్కోడానికి, బతుకు తెరువునిస్తున్న బళ్లకు విద్యుత్ కనెక్షన్ కట్ చేయడానికి తెగబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఫిర్యాదు చేశామని... మంగళవారం మా బండి విద్యుత్ కనెక్షన్ తొలగించడానికి అధికారులు వచ్చారన్నారు. వారికి తమ వద్ద గల కోర్టు ఆర్డర్‌ను చూపించడంతో వెనుతిరిగారని వివరించారు. గతంలో ఇళ్ల వద్ద ఉన్న వాటర్ ట్యాంక్‌ను తొలగించడానికి ఏకంగా పొక్లెయినతో వచ్చారని చెప్పారు. నగర నడిబొడ్డున ఉన్న మా ఇళ్లను ఎలాగైనా ఖాళీ చేయించాలనే కుట్ర పన్నుతున్నారని కన్నీరుమున్నీరయ్యారు. కార్పొరేటర్ తీరు మార్చుకోవాలని, కార్పొరేటర్ ఒత్తిడితో అధికారులు వేధించడం దారుణమన్నారు. కాలువ నిర్మాణ పనులు నిలిపివేశారని, దీంతో దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోయాయన్నారు. వెంటనే కాలువ నిర్మాణ చేపట్టాలని వారు కోరారు.

'అతిథి' ఇంటర్వ్యూల్లో వింత పోకడ!

- గతంలో సిక్స్‌మెన్ కమిటీ
- ఇప్పుడు ఫోర్‌మెన్ కమిటీ
- ఎంపిక కమిటీలో ప్రిన్సిపాళ్లకు దక్కని చోటు

మద్దిలపాలెం: వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్రాయూనివర్సిటీలో అతిథి అధ్యాపకుల భర్తీ ప్రక్రియ వింత పోకడలకు దారితీస్తోంది. ఇంటర్వ్యూ కమిటీ కూర్పులో మార్పులు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గతంలో సిక్స్‌మెన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు జరిగేవి. ఈ కమిటీలో విభాగాధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, సబ్జెక్ట్ నామినీలతో పాటు మరో కళాశాల ప్రిన్సిపాల్ ఉండేవారు. అయితే ఇప్పుడు కొత్తగా ఫోర్‌మెన్ కమిటీని ప్రవేశపెట్టారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. కొత్త కమిటీలో విభాగాధిపతి, బీవోఎస్ చైర్మన్, ఫ్యాకల్టీ చైర్మన్, ఒక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లను నియమించినట్లు భోగట్టా. ఇంతకుముందు ఆయా సబ్జెక్టులకు సంబంధించిన కళాశాల ప్రిన్సిపాల్ ఇంటర్వ్యూ ప్రక్రియలో భాగమయ్యేవారు. ఇప్పుడు ప్రిన్సిపాళ్లను కొత్త కమిటీ నుంచి తొలగించడం వర్సిటీ వర్గాలలో తీవ్ర చర్చకు దారితీసింది. వందేళ్ల వర్సిటీ చరిత్రలో ఇంత వింత పోకడలను ఎన్నడూ చూడలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో అతిథి అధ్యాపకుల ఇంటర్వ్యూలు గందరగోళంగా, అయోమయంగా మారాయని పేర్కొంటున్నారు. ఇప్పటికే ఏయూలో అతిథి అధ్యాపకుల నోటిఫికేషన్‌తో మొదలైన వివాదం ఇప్పుడు ఇంటర్వ్యూల్లో కొత్త విధానంతో మరో మలుపు తిరిగింది. ఉన్నత విద్యామండలి పరిధిలో ఏ వర్సిటీలోనూ ఇలాంటి విధానం అమలు చేయనప్పుడు, ఇక్కడే ఎందుకు అమలు చేస్తున్నారనే వాదన కూడా వినిపిస్తోంది.

జీవీఎంసీ సిబ్బందిపై దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు

మధురవాడ : జీవీఎంసీ సిబ్బందిపై దాడిచేసిన ఐదుగురు వ్యక్తులపై పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి వారు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ జోన్–3 పరిధిలోని సిరిపురం జంక్షన్ వద్ద అక్రమంగా చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం రాత్రి సదరు జోన్ సిబ్బంది పట్టుకున్నారు. అక్కడి నుంచి కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తీసుకువచ్చి అర్ధరాత్రి అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో కొందరు వ్యక్తులు వచ్చి జీవీఎంసీ సిబ్బందిపై దాడి చేసి వాహనాన్ని బలవంతంగా పట్టుకుపోయారు. దీంతో బుధవారం జీవీఎంసీ వెటర్నరీ అధికారి కిశోర్ ఆదేశాల మేరకు జీవీఎంసీ నైట్ శానిటరీ సూపర్‌వైజర్ కె.ఈశ్వరరావు పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఎస్‌ఐ రాము విచారణ చేసి, నిందితులు ఐదుగురిని గుర్తించి కేసు నమోదు చేశారు.

'ఏపీకే' ఫైల్స్ ఓపెన్ చేయకండి

అల్లిపురం: వాట్సాప్‌లో వచ్చే ఏపీకే ఫైల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. వాట్సాప్‌లో ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయడం ద్వారా మొబైల్ ఫోన్ హ్యాకింగ్‌కు గురవుతుందన్నారు. కొన్ని సార్లు ఏపీకే ఫైల్ లింక్ కూడా వస్తుందని దానిని క్లిక్ చేసినా, డౌన్‌లోడ్ చేసినా చిక్కుల్లో పడతారని తెలిపారు. ఏపీకే ఫైల్ బ్యాక్‌గ్రౌండ్‌లో ఉన్న స్పైవేర్ దాడిచేసి, ఫోన్‌లో సమాచారాన్ని హ్యాకర్‌కు చేరవేస్తుందన్నారు. ఫోన్ మన కంట్రోల్‌లో లేకుండా పోతుందని, వాట్సాప్ హ్యాక్ అయి అందరినీ నగదుకావాలని అడగటం, మన పేరు మీద మనకు తెలియకుండా లోన్స్ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇటువంటి ఏపీకే ఫైల్ లింక్‌ను ఓపెన్, డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు.

భూముల క్రమబద్ధీకరణ వేగవంతం

మహారాణిపేట: ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలని, అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణకు ముందుకు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి రెవెన్యూ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. శ్లాబ్ లేదా రేకులతో ఇల్లు నిర్మించుకున్న వారు జీవో ఎంఎస్ నంబర్ 30, 45, 27(యూఎల్‌సీ)లకు లోబడి ఈ ఏడాది డిసెంబరు 31లోగా రెగ్యులరైజ్ చేసుకోవడానికి ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి 151 నుంచి 300 గజాలలోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలని చెప్పారు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని స్పష్టం చేశారు. 450 గజాలకు మించి ఆక్రమించిన వారు, బేసిక్ ధరకు ఐదు రెట్లు, వంద శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం(పీజీఆర్‌ఎస్)లో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని కలెక్టరు ఆదేశించారు. జేసీ కె.మయూర్ అశోక్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాథుర్, డీఆర్వో బి.హెచ్.భవాని శంకర్, సర్వే శాఖ సహాయ సంచాలకుడు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం ప్రారంభం

- గత ప్రభుత్వంలో దివీస్ సీఎస్సార్ నిధులతో నిర్మాణానికి శ్రీకారం

ఆరిలోవ: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. డీఈవో కార్యాలయ సెల్లార్‌లో దివీస్ సంస్థ అందించిన రూ.22.60 లక్షల సీఎస్సార్ నిధులతో నిర్మించిన ఈ కేంద్రాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. డీఈవో ఎన్.ప్రేమకుమార్, దివీస్ ప్రతినిధులతో కలసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ జిల్లాలో పాఠశాల విద్య అభివృద్ధికి ప్రైవేట్ కంపెనీలు సాయపడటం అభినందనీయమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు కష్టపడి విద్యార్థుల ఉత్తీర్ణతను శతశాతానికి పెంచి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని అభిలషించారు. దివీస్ జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు, ఎస్ఎస్ఏ ఏపీసీ బి.చంద్రశేఖర్, డీఈవో కార్యాలయ సిబ్బంది, దివీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో శ్రీకారం

వాస్తవానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2023లో దివీస్ సంస్థ ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం నిర్మాణానికి రూ.22.60 లక్షలు నిధులు కేటాయించింది. అప్పటి డీఈవో ఎల్.చంద్రకళ సూచనలతో కార్యాలయం సెల్లార్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు సిద్ధమై పనులు జరిపించారు. 2024 సాధారణ ఎన్నికలు రావడంతో కొన్నాళ్లు నిలిచిపోయాయి. రెండు నెలల కిందట దీని పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. అప్పుడే అసలు ట్విస్ట్ డీఈవో ప్రేమకుమార్‌కు ఎదురైంది. దివీస్ సంస్థ ప్రతినిధులు రెండు వారాల క్రితం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ప్రారంభానికి పిలిచారు. దీని ప్రకారం ఇక్కడ శిలాఫలకంపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేరు ముఖ్యఅతిథిగా రాయించారు. విషయం తెలుసుకున్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి డీఈవో ప్రేమకుమార్‌పై శివాలెత్తినట్లు సమాచారం. నా నియోజకవర్గంలో వేరే ఎమ్మెల్యేని ప్రారంభానికి పిలుస్తారా అంటూ డీఈవోపై మండిపడినట్లు తెలిసింది. దీంతో అప్పట్లో జరగాల్సిన ప్రారంభోత్సవాన్ని వాయిదా వేశారు. కొత్త శిలాఫలకం తయారుచేయించి బుధవారం ప్రారంభోత్సవం చేసినట్లు విద్యాశాఖ సిబ్బంది గుసగుసలు వినిపించాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దివీస్ సంస్థ ముందుకు వచ్చి దీన్ని నిర్మిస్తే.. కూటమి నాయకులు తమ ఘనతగా చెప్పుకుని సీఎం కల సాకారమంటూ ఉపన్యాసం ఇవ్వడంపై విద్యాశాఖ అధికారులే నివ్వెరపోయారు.



ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్

'దాట్ల'కు రావిశాస్త్రి సాహిత్య పురస్కార ప్రదానం

సీతంపేట: ప్రముఖ కవి, కథా రచయిత, దాట్ల దేవదానం రాజు(యానాం)కు రావిశాస్త్రి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. విశాఖ రసజ్ఞ వేదిక, రావిశాస్త్రి లిటరరీ ట్రస్టు సంయుక్త నిర్వహణలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం జరిగిన సభలో ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ టి.రవిరాజు, విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ రఘురామారావు, రావిశాస్త్రి తనయుడు ఉమా కుమార శాస్త్రి చేతుల మీదుగా దాట్ల దేవదానం రాజును సత్కరించి, పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా రఘురామారావు మాట్లాడుతూ రావిశాస్త్రి 103వ జయంతి సందర్భంగా యానాంకు చెందిన కథా రచయిత దాట్ల దేవదానం రాజుకు పురస్కారం అందజేసినట్టు తెలిపారు. గత ఐదేళ్లుగా విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో రావిశాస్త్రి పేరిట పురస్కారాలు అందజేస్తున్నట్టు తెలిపారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ దాట్ల సాహితీ ప్రతిభకు రావిశాస్త్రి పురస్కారం ఒక కొలమానంగా నిలుస్తుందన్నారు. దాట్ల రాసిన ఎండ్ల బండి, దీపం కింద నీడ వంటి రచనలు పాఠకుల ఆదరణ పొందాయని చెప్పారు. కవి సంధ్య సాహితీ పత్రికను నిర్వహించడమే కాక, ఎందరో యువ కవులకు దాట్ల మార్గదర్శనం చేస్తున్నారని గుర్తుచేశారు. అనంతరం దాట్ల దేవదానం రచించిన 'మనిషి లోపల నీడ' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. తొలి ప్రతిని ఆచార్య బేతవోలు స్వీకరించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, ప్రయాగ సుబ్రహ్మణ్యం, పలువురు సాహితీవేత్తలు, కథా రచయితలు పాల్గొన్నారు.



దాట్ల రాజుకు రావిశాస్త్రి పురస్కారం ప్రదానం చేస్తున్న వైద్యులు రవిరాజు, రఘురామారావు

కుళాయిల నుంచి కలుషిత నీరు

- చిన్న ములగాడలో మూడు రోజులుగా సరఫరా
- అనారోగ్యం పాలవుతున్న గ్రామస్తులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గ్రామస్తులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డులోని చిన్న ములగాడ గ్రామంలో మూడు రోజులుగా బురద రంగుతో కూడిన కలుషిత నీరు సరఫరా అవుతోందని గ్రామస్తులు ఆరోపించారు. మున్సిపల్ కుళాయిల ద్వారా వస్తున్న ఈ నీటిని తాగడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని, జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి వంటి సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామస్తులు ములగాడలోని పట్టణ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు. మంచినీటి పైప్‌లైన్ ఎక్కడో లీక్ అవ్వడం వల్లే ఈ కలుషిత నీరు వస్తోందని, ఈ సమస్యకు తక్షణమే పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై మల్కాపురం వాటర్ సప్లై ఏఈ నాగేశ్వరరావును వివరణ కోరగా.. ఆ గ్రామంలో పైప్‌లైన్‌కు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. భారీ వాటర్ ట్యాంకులు శుభ్రం చేసేటప్పుడు ఒకటి లేదా రెండు రోజులు తేలికపాటి బురద రంగు గల నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. గురువారం ఆ ప్రాంతానికి వెళ్లి సమస్యను గుర్తించి, పరిష్కరిస్తామని తెలిపారు.

ఏషియన్ రోలర్ స్కేటింగ్‌లో దినేష్ సత్తా

తగరపువలస: దక్షిణ కొరియాలో ఈ నెల 29న జరిగిన 20వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఆనందపురం మండలం వెల్లంకి గ్రామ పంచాయతీకి చెందిన గొలగాని దినేష్ రెండు రజత పతకాలు సాధించి తన సత్తా చాటాడు. ఆర్టిస్టిక్, వ్యక్తిగత విభాగాల్లో ఈ పతకాలు సాధించడం విశేషం. 2023లో చైనాలో జరిగిన 19వ ఏషియన్ రోలర్ స్కేటింగ్‌లో కూడా దినేష్ రజత పతకం సాధించాడు. ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో 6 బంగారు, రాష్ట్ర స్థాయిలో 15 బంగారు, జిల్లా స్థాయిలో 18 బంగారు పతకాలు సాధించి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. తల్లిదండ్రులు, కోచ్‌ల ప్రోత్సాహంతోనే ఈ స్థాయిలో చేరుకున్నానని దినేష్ తెలిపాడు. మధురవాడలో 10వ తరగతి చదువుతున్న దినేష్ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించడం తన లక్ష్యమని పేర్కొన్నాడు. ఈ సందర్భంగా దినేష్‌ను కోచ్‌లు సత్యం, చిట్టిబాబు అభినందించారు.



రజత పతకాలు సాధించిన గొలగాని దినేష్

క్షేత్రకు రజతం

ఎంవీపీకాలనీ: సౌత్ కొరియాలో జరిగిన రోలర్ స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన శివకోటి క్షేత్ర ప్రతిభ చూపింది. ఎంవీపీ కాలనీలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న క్షేత్ర ఈ పోటీల్లో రజతం సాధించింది. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం, కుటుంబ సభ్యులు క్షేత్రను అభినందించారు. ఇప్పటి వరకు క్షేత్ర 21 జాతీయ మెడల్స్‌తో సహా 70 పతకాలు సాధించింది.



వెండి పతకం అందుకున్న క్షేత్ర